క్లుప్తంగా

నేడు శ్రీనివాస కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలోని ఉత్తరాధిమఠంలో మంగళవారం శ్రీ శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉభయ దేవేరులతో స్వామిని ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి భక్తులు ఊరేగింపుగా అహోబిళమఠం నుంచి తీసుకొచ్చారు. మహిళా భక్తులు చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. అహోబిళమఠం నుంచి శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయం వరకు ఈ ఊరేగింపు సాగింది. మంగళవారం ఉదయం 9.00 గంటలకు శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల సమ్మె

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీ తలపెట్టిన సమ్మె యథాతథంగా జరుగుతుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి తెలిపారు. సోమవారం సాయంత్రం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె

కడప ఎడ్యుకేషన్ : అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తమ సమస్యలను పరిష్కరించాలని కడప రూరల్, అర్బన్ సెంటర్లలో సమ్మె కొనసాగిస్తున్నారు. వీరు చేపట్టిన సమ్మె కార్యక్రమానికి సోమవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్‌లకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, దీంతోపాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వాజ్‌పేయి చిరస్మరణీయులు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి చిరస్మరణీయులని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప నగరంలోని వివిధ కూడళ్లలో నాయకులు బీజేపీ జెండాను ఆవిష్కరించి వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, మహిళా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వినతులు



సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని రైతులకు టార్పాలిన్ పట్టలతోపాటు పవర్ స్ప్రేయర్లను సబ్సిడీతో అందించాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎంపీ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిలతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ట్యాక్స్ బకాయిల కోసం..

కడప కల్చరల్ : జిల్లాలో పాత బకాయిల రూపంలో ప్రభుత్వానికి పన్నులు రావాల్సి ఉందని, పలు కారణాల వల్ల రైతులు, వ్యాపారులకు ఈ విషయంగా సడలింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షరీఫ్‌ఖాన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. కడప పర్యటనలో భాగంగా సీఎంను ఆయన కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు.

నేడు కాశినాయన ఆరాధన మహోత్సవాలు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని ఎన్.పాలగిరి క్రాస్‌లోని మొగమూరు వాగు సమీపంలో వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో మంగళవారం 28వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పూజా కార్యక్రమాలు, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు భజన కార్యకమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు వేంపల్లె అంజని ఈవెంట్స్ వారిచే పాటలు, జబర్దస్త్ టీమ్ వారిచే కామెడి, మిమిక్రీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి న్యూ కేటగిరి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

కరుణామయుడు వెలుగై వచ్చాడు



ఆరోగ్యమాత చర్చిలో కేక్ కట్ చేస్తున్న గురువులు



క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కడప కల్చరల్ : ఆయన వెలుగై వచ్చాడు.. లోకానికి శాంతి, సమాధానాలను ప్రసాదించేందుకు అరుదెంచారు. శాంతి, ప్రేమలకు ప్రతిరూపంగా కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మించిన క్రీస్తు పర్వదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవ లోకం అత్యంత ఘనంగా నిర్వహించింది.

చర్చిలు, ప్రార్థనా మందిరాలలో ఆయా సంస్థల బిషప్‌లు, పాస్టర్లు, సంఘ కాపరులు, గురువులు క్రీస్తు పుట్టుక గురించి, ఆయన త్యాగాల ద్వారా చేసిన మార్గదర్శనం గురించి తెలిపారు. ఆయన తన జీవితం ద్వారా లోకానికి అందించిన సందేశాన్ని వివరించారు. సామూహికంగా ప్రార్థనలు చేసి ఆనందంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో పాస్టర్ మత్తయ్య బాబు వాక్య సందేశం అందజేశారు.
- ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ పండుగ సందేశం అందజేసి పూజ నిర్వహించారు. గురువులు సల్లా మనోహర్ క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించగా, ఫాదర్ ప్రసాద్‌రావు కేక్ కట్ చేసి విశ్వాసులందరికీ పంచి పెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.
- స్థానిక రాజారెడ్డివీధిలోని కృపా ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలను ప్రసిద్ధ ప్రసంగీకులు బ్రదర్ టీడీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు జననం, సమాజంపై ఆయన ప్రభావం గురించి, మానవులంతా ఆయన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం గురించి తెలిపారు.
- బుడగజంగాల కాలనీలోని న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.
- కాంగ్రిగేషనల్ చర్చి, క్రైస్ట్ చర్చి, మరియాపురం క్యాథడ్రల్ చర్చి తదితర ప్రార్థనా మందిరాలు, నగరంలోని అన్ని చర్చిలు, మందిరాలలో కూడా ఉదయం నుంచి 10 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వెల్లివిరిసిన ఆనందం..

క్రిస్మస్ పర్వదిన సందర్భంగా క్రైస్తవ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లా అంతటా క్రైస్తవ ప్రాబల్యం గల వీధులన్నీ సందడిగా కనిపించాయి. చర్చిలకు పెద్ద సంఖ్యలో జనం రావడంతో నిర్వాహకులు ఆరుబయట పెద్ద ఎత్తున పందిళ్లు వేసి వారు దైవ సందేశం వినేందుకు సౌకర్యం కల్పించారు. పలు క్రైస్తవ స్వచ్ఛంద సంస్థలు పేదలకు అన్నదానం చేశాయి. అనాథ శరణాలయాలు, వికలాంగ బాలల సంస్థల్లో పండ్లు, బ్రెడ్లు, దుస్తులు అందజేశారు.



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు,



దైవ సందేశం అందజేస్తున్న బ్రదర్ టీడీ ప్రసన్నకుమార్

సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం అవసరం



విజేతలతో నిర్వాహకులు

కడప కల్చరల్ : సంప్రదాయ క్రీడలు మన జిల్లాకు వారసత్వ సంపదలని, వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని కడప రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల నారాయణరెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 2024 సంక్రాంతి సంప్రదాయ సంబరాల్లో భాగంగా మూడవరోజు సోమవారం కడప నగరం రాజీవ్ మార్గ్‌లోగల శివశివాని హైస్కూలు ఆవరణలో కర్రసాము, తాడులాడుగు పోటీ (టగ్ ఆఫ్ వార్) లను నిర్వహించారు. ఎనిమిది మహిళా బృందాలు, ఏడు పురుషుల బృందాలు టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో సిసింద్రి జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.15 వేల నగదును పొందారు. నాగాయపల్లె జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 10 వేల నగదును పొందారు. మహిళా విభాగంలో కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల జట్టు మొదటి బహుమతి, జేసీఎస్ అకాడమి జట్టు రెండవ బహుమతి సాధించాయి. కర్రసాము పోటీల్లో 24 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో హేమంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలువగా, ఏజే ప్రసాద్, కె.ధనుష్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో పి.చంద్రకళ. పి.దీప్తికుమారి, ఎస్.శ్వేతాంజలి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

కాపు సామాజిక వర్గానికి సముచిత స్థానం



మాట్లాడుతున్న రాయల్ కాపునాడు సంఘ ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజ

వేంపల్లె : రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాయల్ కాపునాడు సంఘం ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజ తెలిపారు. సోమవారం స్థానిక గండి క్షేత్ర సమీపంలోని హరిత హోటల్ వద్ద కాపు నేతలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం కడపలో కొందరు కాపు నేతలు వైఎస్సార్‌సీపీకి మేము మద్దతు ఇవ్వమని, అన్యాయం జరుగుతుందన్నట్లు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికి రాయల్ కాపు నాడు సంఘం, బలిజ కమ్యూనిటీ నుంచి పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత సి.రామచంద్రయ్యను ఎమ్మెల్సీని, సింగసాని గురుమోహన్‌ను ఉడా చైర్మన్ పదవులు కల్పించిందన్నారు. అలాగే మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రతోపాటు ఇతర ఆయా శాఖల్లో డైరెక్టర్ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ పదవిని బలిజ సామాజిక వర్గానికి ఇవ్వడం జరిగిందన్నారు. అటు రాజకీయాల్లో, ఇటు ప్రాముఖ్యత పదవుల్లో సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటే ప్రతి బలిజ సోదరుడు ఉంటారని వ్యక్తం చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెంది ఎలాంటి ప్రజా సంబంధాలు లేని కొందరు వ్యక్తులు కులాన్ని పార్టీకి ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు. పబ్బం గడుపుకునేందుకు తప్పుడు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ఉచ్చులో పడి కులాలకు, మతాలకు మధ్య చిచ్చుపెట్టి బలిజ కాపులను అవమానపరడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో రాయల్ కాపునాడు సంఘం అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, సీనియర్ నేతలు కావలి హరినాథ్, వెంకటేశ్వర్లు, రాయల్ కాపునాడు మహిళా అధ్యక్షులు సంగా హేమలత, రామ్మోహన్, సోమశేఖర్, పోతిరెడ్డి సావిత్రి, చక్రాయపేట సంఘ మండల అధ్యక్షుడు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని రీజెన్సీ నలంద స్కూల్‌లో సోమవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి, టీటీడీకి చెందిన వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణ క్రతువును నిర్వహించారు. శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

6న అయోధ్య రామయ్య శోభాయాత్ర

నందలూరు (రాజంపేట) : నందలూరులో అయోధ్య రామయ్య శోభాయాత్రను హిందువులు ఐక్యతగా ఒకతాటిపైకి వచ్చి నిర్వహించనున్నారు. జనవరి 6న చేపట్టేందుకు నందలూరు మండల వాసులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు సోమవారం నీలిపల్లె వినాయక ఆలయం వద్ద అయోధ్య రామాలయ శోభాయాత్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ నేతలు శోభాయాత్ర నిర్వహణ తీరుతెన్నులపై చర్చించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని అరవపల్లె, నీలిపల్లె, నందలూరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాంతం, పాటూరు తదితర చుట్టు పక్కల గ్రామాల్లో అయోధ్యరామయ్య శోభాయాత్రపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రతి హిందువు శోభాయాత్రకు కదిలివచ్చేలా చైతన్య పరచాలని కోరారు. ఉదయం 8.30 గంటలకు నాగిరెడ్డిపల్లె శివార్లలోని నూతనంగా కడప–రేణిగుంట స్టేట్ హైవే నిర్మాణం జరిగే ప్రాంతంలోని ఎర్రచెరువు కట్టపై వెలసిన ఆంజనేయ స్వామి నుంచి అయోధ్య రామయ్య శోభాయాత్ర బయలుదేరుతుందన్నారు. ఈ శోభాయాత్ర నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

రేపు బండలాగుడు పోటీలు

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో బుధవారం శ్రీ గురు దత్తాత్రేయ జయంతి సందర్భంగా ఆరు పళ్ల వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 30,000 మొదలుకుని 5 బహుమతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9849322859, 9963223076 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ పరిధిలోని శ్రీ దర్బారు సాయి నగరంలో శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీదర్గా స్వామి కార్యనిర్వాహకులు సత్యమయ్య, శంకర్ స్వాములు తెలిపారు. ఉదయం 10 గంటలకు పంచామృత అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం 1గంటకు నారాయణస్వామి సేవా కార్యక్రమాలు అనంతరం అన్నదానం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సాయంత్రం దర్గాలో ఖాదర్‌వల్లి బాబా జెండా మెరవణి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి శ్రీ సాయి నాథుని పల్లకీ ఉత్సవాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు బ్రహ్మంగారిమఠంలో భూమి పూజ కార్యక్రమం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిలు మంగళవారం పలు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు చేయనున్నట్లు పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వారం దగ్గర వంక సుదరీకరణకు రూ.34.50 లక్షలు, గోకులం నిర్మాణంకు రూ.15.98 లక్షలు, కళ్యాణకట్ట నిర్మాణంకు రూ.20.55లక్షలు, భక్తుల డార్మిటరీ రూ.50.62 లక్షలు, హైమాస్క లైట్లు రూ.34లక్షలు, పోలేరమ్మ దగ్గర ప్రహరీ నిర్మాణంకు రూ.57.72 లక్షలు, పోలేరమ్మదగ్గర షాపింగ్ కాంప్లెక్స్ కు రూ.21.26 లక్షలు, ముఖద్వారం నిర్మాణంకు రూ.7.21లక్షలు, వంటశాలకు రూ.15.69 లక్షలు పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అలాగే బి.మఠం దేవస్థానంలో ప్రాకారం నిర్మాణానికి రూ.1.25 కోట్లు, గాల్వ నైజింగ్ షెడ్ నిర్మాణంకు రూ 98లక్షలు, ఫ్లోరింగ్ నిర్మాణంకు రూ.47లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.42.50 లక్షల నిధులతో పనులు చేయనున్నట్లు తెలిపారు.

శిల్పారామంలో సందడి



గ్రూప్ డ్యాన్స్‌లో చిన్నారులు



వెస్ట్రన్ డ్యాన్స్‌లో యువకుల సందడి

పులివెందుల టౌన్ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శిల్పారామంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం సాయంత్రం శ్రీభైరవేశ్వర ఎంటర్‌ప్రైజెస్, రుచి రెస్టారెంట్ సంయుక్త సహకారంతో విజయవాడ ఎక్సలెంట్, నాగార్జున ఇంగ్లీషు మీడియం పాఠశాలల విదార్థు లు డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకు న్నా యి. క్రిస్మస్ తాత వేషధారణలో ప్రతి ఒక్కరిని పల కరిస్తూ క్రిస్మస్ పండుగ ఉట్టి పడేలా ఆకట్టుకున్నా యి. చిన్నారుల కేరింతల మధ్య శిల్పారామం సందర్శకులు వచ్చి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.



సంబరాలను తిలకిస్తున్న ప్రజలు

నేడు గురుకుల పాఠశాల భవనాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారి మఠం మండలంలోని తొట్లపల్లె దగ్గర నూతనంగా నిర్మించిన మహా గురుకుల పాఠశాల భవనాలను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి , మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లాలో మొదటగా మహాగురుకులం బ్రహ్మంగారిమఠం మండలంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం చదువుతో పాటు వసతి, ఆటలు, మంచి వాతావరణంలో పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాల భవనాల ప్రారంభానికి అధికారులు అన్ని సిద్ధం చేశారు.

వైభవంగా అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర



శ్రీరాముని అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



శ్రీరాముని అక్షింతల శోభాయాత్రకు వేలాదిగా హాజరైన భక్తులు

బద్వేలు అర్బన్ : భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శ్రీరాముడిని పూజించిన అక్షింతలు సోమవారం బద్వేలుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షింతల శోభాయాత్ర వేలాది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని మారుతిభజన మండలి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా మైదుకూరు రోడ్డు, సిద్ధవటం రోడ్డు, నెల్లూరు రోడ్డులోని గోవిందమఠం ఆవరణలో గల శ్రీదేవి, భూదేవి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. ఈ శోభాయాత్రలో పట్టణానికి చెందిన ఆయా పార్టీల రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య, బలిజ, రెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులతో పాటు పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్రలో ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కన్వీనర్ రామకోటిరాజు, అధ్యక్షులు కొండపల్లి వెంకటసుబ్‌షులు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగేనాటికి భక్తులందరికి ఈ అక్షింతలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కొంకులరాంబాబు, బలిజ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దద్దంవెంకటేశ్వర్లు, కొర్రపాటిసురేంద్ర, పెరుగువెంకటయ్య, కార్యక్రమ నిర్వాహకులు ఈశ్వరయ్య, యర్రంరెడ్డి, సంజీవరెడ్డి, వి.వి.రమణ, శ్రీనివాసులు, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, రెడ్డిసేవా సంఘం అధ్యక్షుడు గంగసానిసాంబశివారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా అక్షింతలను తీసుకువస్తున్న భక్తులు

ఆనంవారిపల్లెకు చేరిన అయోధ్య అక్షింతలు

కాశినాయన : అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తి కాబడి 2024 జనవరి 22వ తేదీన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుండి అక్షింతలు రాష్ట్రాలకు, జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాలకు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని ఆనంవారిపల్లె గ్రామానికి డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా అక్షింతలు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

గోపవరం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీన మండలంలోని పి.పి.కుంటలో వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే సుధ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. సిద్దవటంకు చెందిన టీం విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా పి.పి.కుంట టీం ఎంపికైంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, వెంకటేష్ చేతులమీదుగా మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలును వారికి అందజేశారు. బేతాయపల్లె సచివాలయ కన్వీనర్ మునగలసునీల్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పులివెందుల రూరల్ : పులివెందులలోని రవీంద్ర నాథ ఉన్నత పాఠశాలలో 1992–93 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానిక పులివెందుల పట్టణంలోని వైఎస్ పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు చూపించిన శ్రద్ధ వల్ల తాము ఈస్థాయిలో ఉన్నామని విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు